కుంకుమార్చన



సనత్‌నగర్: సికింద్రాబాద్ ఉజ్జయినీ మహంకాళి దేవస్థానంలో మంగళవారం సామూహిక కుంకుమార్చన భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. సుమారు 500 మంది మహిళలు కుంకుమార్చన చేశారు. ఈఓ మనోహర్‌రెడ్డి, చైర్మన్ రామేశ్వర్, ధర్మకర్తల మండలి సభ్యులు ప్రత్యేక ఏర్పాట్లు చేశారు.

గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు



బన్సీలాల్‌పేట్: గాంధీనగర్ ఇన్‌స్పెక్టర్‌గా రాజు బాధ్యతలు స్వీకరించారు. ఇంతకు ముందు ఇన్‌స్పెక్టర్‌గా కొనసాగిన రవి ముషీరాబాద్ స్టేషన్‌కు బదిలీ కాగా, గద్వాల్ జిల్లా అలంపూర్ సర్కిల్ ఇన్‌స్పెక్టర్‌గా విధులు నిర్వహించిన రాజును గాంధీనగర్ స్టేషన్‌కు బదిలీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. శాంతి భద్రతల పరిరక్షణతో పాటు నేరాల అదుపునకు గట్టి చర్యలు తీసుకుంటామన్నారు. శాంతిభద్రతలకు విఘాతం కలిగించే వ్యక్తులు, శక్తుల పట్ల కఠినంగా వ్యవహరిస్తామని శాంతిభద్రతలకు విఘాతం కలిగిన సమయంలో ఎవరైనా తనను నేరుగా లేదా 8712660140కు సమాచారం ఇవ్వాలన్నారు.

సర్వే పూర్తయింది.. లబ్ధి మిగిలింది!

- గృహజ్యోతి వివరాల సేకరణ పూర్తి
- సనత్‌నగర్ నియోజకవర్గంలో 25000 పైచిలుకు లబ్ధిదారులు
- కొనసాగుతున్న స్పెషల్ డ్రైవ్, మరింత మంది పెరిగే అవకాశం



సర్వే చేస్తున్న ఎలక్ట్రికల్ సిబ్బంది (ఫైల్)

సనత్‌నగర్: ప్రభుత్వం ప్రవేశపెట్టిన అభయహస్తం ఆరు గ్యారంటీల్లో భాగంగా గృహజ్యోతి పథకం కింద చేపట్టిన సర్వే దాదాపుగా పూర్తయ్యింది. వాస్తవానికి ఈ నెల 15వ తేదీ వరకు సర్వే గడువు పూర్తవ్వగా.. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇంకా ఎవరైనా లబ్ధి దారులు మిగిలి ఉన్నారా అనే దానిపై స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహిస్తున్నారు. ముఖ్యంగా తాళాలు వేసి ఉన్న ఇళ్లను ఒకటికి రెండుసార్లు వెళ్లి వారి వివరాలను నమోదు చేసుకునే ప్రయత్నాలు చేస్తున్నారు. ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తులతో పాటు దరఖాస్తు చేసుకోని, తెల్లరేషన్‌కార్డు లేని వారి వివరాలను కూడా సేకరించారు. సనత్‌నగర్ నియోజకవర్గం పరిధిలోని సనత్‌నగర్, ఎస్ఆర్‌నగర్, బేగంపేట, బైబిల్ హౌస్, క్లాక్‌టవర్, జనరల్ బజార్, ప్యారడైజ్ విద్యుత్ సెక్షన్ల పరిధుల్లో దాదాపు వంద మందికి పైగా సిబ్బంది సర్వేలో నిమగ్నమయ్యారు. ఇంటింటికీ వెళ్లి విద్యుత్ మీటర్ల నెంబర్లతో పాటు రేషన్, ఆధార్‌కార్డు, ప్రజాపాలన దరఖాస్తు నెంబర్లను సేకరించి ఆన్‌లైన్‌లో నమోదు చేస్తున్నారు.

ఆ ప్రాంతాల్లోనే ఎక్కువ..

బన్సీలాల్‌పేట, సనత్‌నగర్, బేగంపేట డివిజన్‌లలో ఎక్కువ మంది లబ్ధిదారులను గుర్తించారు. బన్సీలాల్‌పేటలో ఎక్కువగా మురికివాడలు, బస్తీలు ఉండడంతో పాటు సనత్‌నగర్ ప్రాంతంలో పలు బస్తీలతో పాటు మధ్యతరగతి కుటుంబాలు ఎక్కువ ఉన్నాయి. ఈ నేపథ్యంలో 200 యూనిట్ల లోపు విద్యుత్ వినియోగించే వారి సంఖ్య కూడా ఈ రెండు డివిజన్లలోనే అధికం. ఇక ఎస్సార్‌నగర్, బేగంపేట, ప్యారడైజ్, క్లాక్‌టవర్, జనరల్‌బజార్ సెక్షన్ల పరిధుల్లో ఎక్కువగా వ్యాపార, వాణిజ్య కేంద్రాలుగా ఎక్కువగా ఉండడంతో ఆయా సెక్షన్లలో లబ్ధిదారుల సంఖ్య తక్కువగానే ఉందనే చెప్పాలి.

సెక్షన్	మొత్తం కనెక్షన్లు (ఏ-కేటగిరి)	లబ్ధిదారుల అంచనా..
సనత్‌నగర్	21,013	6,496
ఎస్ఆర్‌నగర్	18,672	4,040
బేగంపేట	20,080	5,700
బైబిల్‌హౌస్	7,074	2,200
క్లాక్‌టవర్	11,023	2,700
జనరల్ బజార్	6,216	1200
ప్యారడైజ్	8,084	1500

గుర్తించిన వివరాలు..

ఇంటింటి సర్వేతో పాటు ప్రజాపాలనలో వచ్చిన దరఖాస్తుల పరిశీలన, తెల్లరేషన్‌కార్డు లేకుండా 200 యూనిట్ల లోపు విద్యుత్ వాడుతున్న వారి వివరాలను అధికారులు సేకరించారు. అయితే ఆ మూడు రూపాల్లో సేకరించిన వివరాల ఆధారంగా ఎవరెవరు 200 యూనిట్ల లోపు వినియోగిస్తున్నారనే విషయంపై ఒక స్పష్టత రానుంది. ఇంకా అక్కడక్కడ స్పెషల్ డ్రైవ్‌లు నిర్వహించి మిగిలి ఉన్నవారి వివరాలను కూడా నమోదు చేస్తున్నారు. నియోజకవర్గం వ్యాప్తంగా రేషన్‌కార్డు ఆధారంగా 25 వేల పైచిలుకు వినియోగదారులను 200 యూనిట్ల లోపు వినియోగించే కేటగిరిలో ఉంటారని అంచనా.

సద్వినియోగం చేసుకోవాలి..

ఇప్పటివరకు ఇంటింటి సర్వేతో పాటు మైకుల ద్వారా గృహజ్యోతి పథకంపై అవగాహన కల్పించాం. సర్వే పూర్తయినప్పటికీ ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు స్పెషల్ డ్రైవ్ నిర్వహించి మిగిలిన వారి వివరాలను సేకరిస్తున్నాం. ఈ అవకాశాన్ని గృహ విద్యుత్ వినియోగదారులు సద్వినియోగం చేసుకోవాలి.

–దుర్గాప్రసాద్, ప్యారడైజ్ ఏడీఈ

కాంగ్రెస్ అభ్యర్థికే మద్దతిస్తాం



వేణుగోపాల్ స్వామిని సన్మానిస్తున్న రైల్వే ఉద్యోగులు

సికింద్రాబాద్: వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో సికింద్రాబాద్ పార్లమెంట్ నియోజకవర్గం నుంచి కాంగ్రెస్ అభ్యర్థిగా వేణుగోపాల్ స్వామి ఆసక్తి కనబరుస్తున్నారు. ఈ నేపథ్యంలో మంగళవారం దక్షిణ మధ్య రైల్వే ఎంప్లాయిస్ సంఘ్ సెంట్రల్ ఆఫీస్‌కు వెళ్లిన ఆయన ఉద్యోగులను కలుసుకున్నారు. పార్టీ అవకాశం కల్పిస్తే తన గెలుపు కోసం అందరూ సహకరించాలని కోరారు. ఈ సందర్భంగా సంఘ్ సంయుక్త ప్రధాన కార్యదర్శి భరణీ భానుప్రసాద్ మాట్లాడుతూ.. మొదటి నుంచి రైల్వే కార్మికులు కాంగ్రెస్ పార్టీతోనే ఉన్నారని పార్లమెంట్ ఎన్నికల్లో సైతం తమ మద్దతు కాంగ్రెస్ అభ్యర్థికే ఉంటుందని స్పష్టం చేశారు.కేంద్రంలోని మోదీ ప్రభుత్వం పూర్తిగా ప్రజా వ్యతిరేఖ విధానాలకు పాల్పడుతుందని, ఈ ఎన్నికల్లో బీజేపీకి తగిన గుణపాఠం తప్పదన్నారు. ఈ కార్యక్రమంలో ప్రభు రాజ్, ప్రసాద్, చంద్రశేఖర్, రాజశేఖర్ పాల్గొన్నారు.

ప్రజలపై భారం మోపొద్దు



సీఈఓ మధుకర్ నాయక్‌కు అభ్యంతరాల ప్రతిని అందజేస్తున్న సతీష్ గుప్తా

కంటోన్మెంట్: బోర్‌వెల్స్ నియంత్రణ, నిర్వహణ పేరిట పేదలపై భారం మోపవద్దంటూ సామాజిక కార్యకర్త తేలుకుంట సతీష్ గుప్తా బోర్డు అధికారులకు విన్నవించారు. భూగర్భ జలాల పరిరక్షణలో భాగంగా కంటోన్మెంట్ నూతన విధి, విధానాలను రూపొందించి అభ్యంతరాలను తెలపాలంటూ ప్రజలకు సూచించింది. తొలి విడతలో ఎవరూ స్పందించకపోవడంతో మరోసారి అవకాశం కల్పించింది. దీంతో మంగళవారం సతీష్ గుప్తా తన అభ్యంతరాలను సీఈఓ మధుకర్ నాయక్‌కు అందజేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ.. కంటోన్మెంట్‌లో ఈ పాటికే రాష్ట్ర ప్రభుత్వం, కంటోన్మెంట్ బోర్డు నుంచి అనుమతులు తీసుకున్నాకే బోర్‌వెల్స్ మంజూరు చేస్తున్నారని తెలిపారు. తాజాగా బోర్డు అధికారులు సరికొత్త నిబంధనలు రూపొందించి అమలు చేస్తుండటంతో ప్రజలపై భారం పెరుగుతుందన్నారు.

స్కాలర్‌షిప్‌ల పంపిణీ అభినందనీయం



స్కాలర్‌షిప్పులు అందజేస్తున్న మహేష్‌కుమార్‌గౌడ్

ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్

సనత్‌నగర్: పేద విద్యార్థినులకు స్కాలర్‌షిప్‌ల పంపిణీ అభినందనీయమని ఎమ్మెల్సీ మహేష్‌కుమార్ గౌడ్ పేర్కొన్నారు. సామాజిక సేవా కార్యక్రమంలో భాగంగా మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ సంస్థ 1192 మంది విద్యార్థినులకు మంగళవారం స్కాలర్‌షిప్‌లను పంపిణీ చేశారు. బేగంపేటలోని ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాల ప్రాంగణంలో జరిగిన ఈ కార్యక్రమానికి తెలుగు రాష్ట్రాల నుంచి ఎంపిక చేసిన విద్యార్థినులు స్కాలర్‌షిప్‌లు అందుకున్నారు. ఈ కార్యక్రమానికి హాజరైన ఎమ్మెల్సీ మహేష్‌కుమార్‌గౌడ్, సోమాజీగూడ కార్పొరేటర్ వనం సంగీత ఒక్కొక్కరికీ రూ.8 వేల నుంచి రూ.10 వేల వరకు స్కాలర్ షిప్‌లు అందజేశారు. ఈ సందర్భంగా మహేష్‌కుమార్‌గౌడ్ మాట్లాడుతూ.. ప్రభుత్వ కళాశాల్లో చదివే విద్యార్థులకు స్కాలర్‌షిప్‌లు అందించేందుకు కార్పొరేట్ సంస్థలు ముందుకురావడం అభినందనీయమన్నారు. మలబార్ గోల్డ్ అండ్ డైమండ్స్ జోనల్ హెడ్ షరీజ్ కే మాట్లాడుతూ.. ప్రతియేటా పేదల గృహ నిర్మాణం, విద్యా, వైద్యం, పర్యవరణ పరిరక్షణ, మహిళా సాధికారతకు తమ సంస్థ ఐదు శాతం కేటాయిస్తుందన్నారు. తెలంగాణలో స్కాలర్‌షిప్పుల ద్వారా 19 వేల మంది విద్యార్థులకు రూ.12.5 కోట్లు అందించినట్లు తెలిపారు. కార్యక్రమంలో స్టోర్ హెడ్ మహ్మద్ రజయ్‌లతో పాటు మలబార్ గ్రూప్ మేనేజ్‌మెంట్ సభ్యులు పాల్గొన్నారు.

ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు

ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్



స్థానికులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే తలసాని

సనత్‌నగర్: ప్రజావసరాలకు అనుగుణంగా అభివృద్ధి పనులు చేపట్టి ఎలాంటి అసౌకర్యానికి గురికాకుండా చూస్తున్నట్లు మాజీ మంత్రి, సనత్‌నగర్ ఎమ్మెల్యే తలసాని శ్రీనివాస్‌యాదవ్ అన్నారు. రాంగోపాల్‌పేట డివిజన్ పీజీరోడ్డులో మంగళవారం ఆయన వివిధ శాఖల అధికారులతో కలిసి పర్యటించి స్థానిక ప్రజల సమస్యలను అడిగి తెలుసుకున్నారు. కొన్ని సమస్యలను ఎమ్మెల్యే దృష్టికి తీసుకురాగా, వాటి పరిష్కారానికి తీసుకోవాల్సిన చర్యలపై అధికారులను ఆదేశించారు. అదే విధంగా డిమ్మీ షాప్ నుంచి రామమందిర్ వరకు రోడ్డు పూర్తిగా ధ్వంసమైందని నూతన రోడ్డు నిర్మాణం చేపట్టాలని స్థానికులు కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ.. రోడ్డు నిర్మాణం కోసం రూ.30 లక్షలను మంజూరు చేయించడం జరిగిందని, త్వరలోనే పనులు చేపడతారని వివరించారు. ఈ కార్యక్రమంలో బేగంపేట కార్పొరేటర్ టి.మహేశ్వరిశ్రీహరి, డీఎంసీ సమ్మయ్య, ఈఈ సుదర్శన్, వాటర్‌వర్క్స్ జీఎం వినోద్, డీజీఎం శశాంక్, టౌన్‌ప్లానింగ్ ఏసీపీ క్రిస్టోఫర్, బీఆర్ఎస్ నాయకులు శ్రీహరి, కిషోర్, ఆరీఫ్, అరుణ్‌భట్, ప్రవీణ్, సంజయ్ పాల్గొన్నారు.

సిక్కు సమాజ్‌కు అండగా ఉంటాం..

సిక్కు సమాజ్‌కు తన సహకారం ఉంటుందని, వారి సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని తలసాని శ్రీనివాస్ యాదవ్ అన్నారు. ఇటీవల అమీర్‌పేట గురుద్వార్ కమిటీకి జరిగిన ఎన్నికల్లో అధ్యక్షుడిగా ఎన్నికైన దర్శన్‌సింగ్, ప్రధాన కార్యదర్శి సురేందర్ మంగళవారం మాజీ కార్పొరేటర్ శేషుకుమారితో కలిసి ఎమ్మెల్యేను మర్యాదపూర్వకంగా కలిశారు. గడిచిన పదేళ్లలో సిక్కు సోదరులకు అన్ని విధాలుగా అండగా ఉంటూ వచ్చానని, ఇకముందు కూడా తన సహాయ సహకారాలు ఉంటాయన్నారు. టిల్లు, సుమిత్‌సింగ్, అజ్జు, లాహోర్‌సింగ్ పాల్గొన్నారు.

సిరిపురం యాదయ్యకు నివాళి

ఉస్మానియా యూనివర్సిటీ: తెలంగాణ ఉద్యమంలో ఆత్మబలిదానం చేసుకున్న సిరిపురం యాదయ్యకు పలువురు నివాళులర్పించారు. మంగళవారం ఎన్‌సీసీ గేటు వద్ద ఏర్పాటు చేసిన వర్ధంతి కార్యక్రమానికి ప్రొ.కోదండరామ్, స్వామిగౌడ్, దేశపతి శ్రీనివాస్, తాటికొండ వెంకటరాజయ్య, సిరిపురం ఉపేందర్ తదితరులు పాల్గొని యాదయ్య చిత్రపటానికి నివాళి అర్పించారు. సిరిపురం యాదయ్య ఆత్మబలిదానం చేసుకున్న ఎన్‌సీసీ గేటు వద్ద ఆయన విగ్రహాన్ని ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు.

ఖాళీ స్థలంపై ఆర్డీఓకు వినతి



ఆర్డీఓకు వినతిపత్రం ఇస్తున్న టీఎన్ శ్రీనివాస్

రసూల్‌పురా: రసూల్‌పురా జగదీష్‌నగర్ కాలనీలోని ఖాళీ స్థలాన్ని బస్తీవాసులకు ఉపయోగపడేలా చర్యలు తీసుకోవాలని బీఆర్ఎస్ ఇన్‌చార్జి టీఎన్. శ్రీనివాస్ ఆధ్వర్యంలో స్థానికులు సికింద్రాబాద్ ఆర్డీఓ ధరంసింగ్‌కు వినతిపత్రం ఇచ్చారు. అనంతరం శ్రీనివాస్ మాట్లాడుతూ.. జగదీష్ నగర్ కాలనీ ప్లాట్ నంబర్-2 లో140 గజాలకు పైగా ఖాళీ స్థలంలో గోడ నిర్మించాడని ఆ స్థలాన్ని సంరక్షించి బస్తీవాసులకు ఉపయోగపడేలా చర్యలు చేపట్టాలని సోమవారం హైదరాబాద్ జిల్లా కలెక్టర్‌కు వినతిపత్రం ఇవ్వగా కలెక్టర్ సూచన మేరకు ఆర్డీఓను కలిసి వినతిపత్రం అందజేశామన్నారు.

అనిల్‌కుమార్‌యాదవ్‌కు అభినందలు



అనిల్‌కుమార్‌యాదవ్‌కు జ్ఞాపిక అందజేస్తున్న చక్రధర్‌యాదవ్

సనత్‌నగర్: రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షుడు అనిల్‌కుమార్ యాదవ్‌కు రాష్ట్ర యాదవ మహాసభ అధ్యక్షుడు యల్లావుల చక్రధర్‌యాదవ్ అభినందనలు తెలిపారు. కాంగ్రెస్ పార్టీ రాజ్యసభ సభ్యుడిగా యాదవ వర్గానికి చెందిన అనిల్‌కుమార్‌యాదవ్‌కు ఇవ్వడం యాదవ జాతి ఆనందంగా ఉందని చక్రధర్‌యాదవ్ అన్నారు.

- రాజ్యసభ సభ్యుడిగా ఎన్నికైన అనిల్‌కుమార్ యాదవ్‌ను యాదగిరిగుట్ట దేవాలయ మాజీ ట్రస్ట్ బోర్డు సభ్యులు ఎడ్ల రాజ్‌కుమార్, కాంగ్రెస్ సీనియర్ నాయకులు డాక్టర్ శ్రీధర్ శుభాకాంక్షలు తెలిపారు.

వైద్య కళాశాలకు మృతదేహం అందజేత



గండూరి సువర్ణల(ఫైల్)

అడ్డగుట్ట: కెనరా బ్యాంక్ రిటైర్డ్ ఉద్యోగి మృతదేహాన్ని వైద్య కళాశాలకి అందజేసి మృతురాలి చివరి కోరిక తీర్చారు ఆమె కుటుంబ సభ్యులు. వివరాలిలా ఉన్నాయి. గండూరి సువర్చల(62) ఇది వరకు తుకారాంగేట్ పోలీస్‌స్టేషన్ పరిధిలోని సికింద్రాబాద్ రైల్ నిలయం బ్రాంచిలో విధులు నిర్వహించి పదవీ విరమణ పొందారు. బెంగళూరు వెళ్లిన ఆమెకు అకస్మాత్తుగా గుండెపోటు వచ్చి మరణించారు. భర్త ఓంకార్ స్వరూప్ ఈసీఐఎల్‌లో విధులు నిర్వహించి పదవీ విరమణ చేసి నేరేడ్‌మెట్‌లో నివాసముంటున్నారు. వీరికి దివ్య, సౌమ్య ఇద్దరు కుమార్తెలు. మంగళవారం నిర్వహించిన సంస్మరణ కార్యక్రమంలో పలువురు మాట్లాడారు. సువర్చలతో అనుభవాలు, జ్ఞాపకాలు గుర్తు చేసుకుంటూ బ్రాహ్మణ కుటుంబంలో పుట్టిన ఆమె ఆచార్య వ్యవహారాలు లెక్క చేయకుండా ఆమె చివరి కోరిక మేరకు మృతదేహాన్ని వైద్య విద్యార్థులకు ఉపయోగపడేలా అందజేయటం ఉన్నతమైన పని అని పేర్కొన్నారు. బంధువులు, మిత్రులు, బ్యాంక్ ఉద్యోగులు ఆమె చిత్రపటానికి నివాళులర్పించారు.

గుండెపోటుతో బీఆర్ఎస్ నేత మృతి



మృతదేహం వద్ద నివాళి అర్పిస్తున్న మోతే శోభన్‌రెడ్డి

లాలాపేట: సికింద్రాబాద్ ప్రాంతంలో పేరొందిన తార్నాకలోని రెడ్డి అండ్ రెడ్డి మోటార్ డ్రైవింగ్ స్కూల్ వ్యవస్థాపకులు, బీఆర్ఎస్ నియోజకవర్గ సీనియర్ నాయకులు హన్మంత్‌రెడ్డి (59) సోమవారం రాత్రి గుండెపోటుతో మృతి చెందారు. హన్మంత్ రెడ్డి మృతిపై సికింద్రాబాద్ ఎమ్మెల్యే పద్మారావు గౌడ్ సంతాపం ప్రకటించారు. తార్నాక విజయపురి కాలనీలోని ఆయన నివాసంలో హన్మంత్ రెడ్డి మృతదేహానికి బీఆర్ఎస్ కార్మిక విభాగం రాష్ట్ర అధ్యక్షులు మోతే శోభన్‌రెడ్డి, బీ జేపీ నాయకులు బండా చంద్రారెడ్డి, వివిధ పార్టీలకు చెందిన నాయకులు నివాళి అర్పించారు.

నియామకం



కపిల్ బరాబరి

కంటోన్మెంట్: బీజేపీ ఎస్సీ మోర్చా రాష్ట్ర కార్యదర్శిగా కంటోన్మెంట్‌కు చెందిన కపిల్ బరాబరి నియమితులైనట్లు ఆ పార్టీ రాష్ట్ర కార్యాలయ కార్యదర్శి బి. ఉమాశంకర్ ఓ ప్రకటనలో వెల్లడించారు. ఎస్సీ మోర్చా నూతన కమిటీలో ఆరుగురు ఉపాధ్యక్షులు, ముగ్గురు ప్రధాన కార్యదర్శులు, ఆరుగురు కార్యదర్శులు సహా మరో 18 మందికి అవకాశం కల్పించారు. ఈ సందర్భంగా కపిల్ బరాబరి మాట్లాడుతూ.. పార్టీ బలోపేతానికి తన వంతు కృషి చేస్తానన్నారు.

షేక్ సర్ఫరాజ్‌కు డాక్టరేట్



ఉస్మానియా యూనివర్సిటీ: ఓయూ విద్యార్థి షేక్ సర్ఫరాజ్‌కు పీహెచ్‌డీ డాక్టరేట్ డిగ్రీ లభించింది. ఆర్ట్స్ కాలేజీలోని లైబ్రరీ సైన్స్ విభాగం విశ్రాంత అధ్యాపకులు చంద్రశేఖర్ పర్యవేక్షణలో స్టేటస్ ఇనిస్టూషనల్ రిపాసిటరీస్ డెవలప్‌మెంట్ బై స్పెషల్ లైబ్రరీస్ ఇన్ ఇండియా యాన్ ఎక్స్ ప్లొరేటరీ స్టడీ అనే అంశంపై పరిశోధనకు డాక్టరేట్ పట్టా అందుకున్నారు. నగరంలోని సెంటర్ ఫర్ గుడ్ గవర్నెన్స్‌లో లైబ్రేరియన్‌గా పని చేస్తున్న సర్ఫరాజ్‌ను మిత్రులు కోటి యాదవ్, తదితరులు అభినందనలు తెలిపారు.



ఆక్రమణల తొలగింపుతో సాఫీగా సాగుతున్న రాకపోకలు

సాక్షి ఎఫెక్ట్..

ట్రాఫిక్ క్లియర్!

- సాక్షి కథనంతో కదిలిన యంత్రాంగం
- ఫుట్‌పాత్ వ్యాపారులకు కౌన్సెలింగ్
- మోండా మార్కెట్ రోడ్డులో సాఫీగా రాకపోకలు

బన్సీలాల్‌పేట్: సికింద్రాబాద్ మోండా మార్కెట్‌లో ఫుట్‌పాత్‌ల ఆక్రమణలతో అడుగుతీసి అడుగుపెట్టలేని దుస్థితి ఉండేది. ఈ మార్గంలో రాకపోకలు సాగించాంటే సాహసం చేయాల్సిన దుస్థితి నెలకొనేది. గంటల తరబడి ట్రాఫిక్ స్తంభించి వాహనదారుల సహనాన్ని పరీక్షించేది. ఈ సమస్యలపై ' మోండా మార్కెట్.. ట్రాఫిక్‌తో ఇరిటేట్' అనే శీర్షికతో ఈ నెల 20న 'సాక్షి'లో ప్రచురితమైన కథనానికి ఉత్తర మండలం ట్రాఫిక్ పోలీసులు స్పందించారు. మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో తమ సిబ్బందితో వచ్చి ఫుట్‌పాత్ ఆక్రమణలను తొలగించి రాకపోకలు సాఫీగా సాగేలా చర్యలు చేపట్టారు. మోండా మార్కెట్ ఓల్డ్ నుంచి పాలికాబజార్ చౌరస్తా, అల్ఫాహోటల్ రోడ్డు, 31 బస్టాప్ రోడ్ల ఆక్రమణలను పోలీసులు తొలగించారు. మోండా మార్కెట్ ప్రాంతాన్ని ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు, మహంకాళి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఉప శంకర్, ఎస్.ఐ శ్రీధర్‌తో పాటు పెద్ద ఎత్తున సిబ్బంది ఈ ప్రాంతంలో పర్యటించారు. ట్రాఫిక్ తీరుతెన్నులను పరిశీలించారు. ట్రాఫిక్ జామ్ కాకుండా తీసుకోవాల్సిన చర్యలపై ఏసీపీ శంకర్ రాజు తమ సిబ్బంది పలు సూచనలు చేశారు. మోండా మార్కెట్ పరిసరాల్లో ట్రాఫిక్ సమస్యపై ప్రత్యేక చొరవ చూపిన సాక్షికి స్థానికులు కృతజ్ఞతలు తెలిపారు.



రోడ్లపై వ్యాపారాలు చేయరాదు

మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల ఫుట్‌పాత్ వ్యాపారులకు ట్రాఫిక్ ఏసీపీ శంకర్ రాజు ట్రాఫిక్ పై పలు సూచనలు చేశారు. ఫుట్‌పాత్ వ్యాపారస్తులు, దుకాణదారులు, తోపుడుబండ్ల నిర్వాహకులను పిలిచి ట్రాఫిక్‌కు ఇబ్బందులు కలిగించకుండా తమ కార్యకలాపాలను కొనసాగించాలని సూచించారు. రోడ్లపైకి వచ్చి వ్యాపార కార్యకలాపాలు సాగిస్తుండటంతో ట్రాఫిక్‌కు స్తంభించి ప్రజలు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారని చెప్పారు. ట్రాఫిక్ జామ్ చేస్తూ వ్యాపారాలు నిర్వహించుకోవడం వల్ల ప్రజలు ఇబ్బంది పడుతున్న విషయాన్ని గ్రహించాలని కోరారు. మోండా మార్కెట్ పరిసర ప్రాంతాల్లో ట్రాఫిక్‌ను క్రమబద్ధీకరిస్తామని ప్రజలకు ఇబ్బందులు లేకుండా అన్ని రకాల చర్యలు తీసుకుంటామని ఏసీపీ శంకర్ రాజు వెల్లడించారు.


సాక్షి

మోండా మార్కెట్..
ట్రాఫిక్‌తో ఇరిటేట్!

సాక్షిలో ప్రచురితమైన కథనం

పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తికి జైలుశిక్ష



ఉప్పరి రఘు

చిలకలగూడ: మద్యం మత్తులో ప్రజా జీవనానికి ఆటంకం కలిగించడంతో పాటు పోలీసులపై దాడికి పాల్పడిన వ్యక్తిని జైలుకి తరలించిన ఘటన చిలకలగూడ పోలీస్ స్టేషన్ పరిధిలో చోటు చేసుకుంది. అడ్మిన్ ఎస్ఐ బాలరాజు వివరాల ప్రకారం.. చిలకలగూడ హమాలీబస్తీకి చెందిన ఉప్పరి రఘు(34) ప్రైవేటు ఉద్యోగి. ఈ నెల 19న రాత్రి 7 గంటల సమయంలో పూటుగా మద్యం తాగి హమాలీబస్తీలో వీరంగం చేస్తూ ప్రజా జీవనానికి ఆటంకం కలిగిస్తున్నాడు. ఓ మహిళ ఫిర్యాదు మేరకు పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని రఘును అదుపులోకి తీసుకుని ఠాణాకు తరలిస్తుండగా, మార్గమధ్యలో చిలకలగూడ కట్టమైసమ్మ ఆలయం వద్ద నడిరోడ్డుపై గట్టిగా కేకలు వేస్తూ, అసభ్య పదజాలంతో దూషిస్తూ పోలీసులపై దాడికి పాల్పడి, ట్రాఫిక్‌కూ అంతరాయం కలిగించాడు. ఈ ఘటనలో ఇరువురు కానిస్టేబుళ్లకు గాయాలయ్యాయి. పలు సెక్షన్ల కింద కేసులు నమోదు చేసి సికింద్రాబాద్ 10 ఎంఎం కోర్టులో హాజరు పర్చగా, 14 రోజుల జైలుశిక్ష విధిస్తూ న్యాయమూర్తి జస్టిస్ ప్రశాంతి తీర్పునిచ్చారు.